క్లుప్తంగా

దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌పై ఈఓ కె.రామచంద్రమోహన్ శనివారం ఆలయ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష జరిపారు. ఆలయ ప్రాంగణంలోని ఈఓ చాంబర్‌లో జరిగిన ఈ సమీక్ష సమావేశానికి ఈఈలు కోటేశ్వరరావు, వైకుంఠరావు, డీఈఈ, ఏఈలతో పాటు టెక్నికల్ టీం సభ్యులు హాజరయ్యారు. ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అన్నదానం, ప్రసాదాల పోటుతో పాటు ఘాట్ రోడ్డులో కొండ రాళ్లు జారిపడకుండా జరుగుతున్న పనులపై ఈఓ రామచంద్రమోహన్ సమీక్ష నిర్వహించారు. మాస్టర్ ప్లాన్‌లో కూటమి ప్రభుత్వం కొన్ని మార్పులు, చేర్పులను సూచించడంతో వాటికి తుది రూపాన్ని త్వరితగతిన సిద్ధం చేయాలని సూచించారు. సుమారు గంట పాటు నిర్వహించిన ఈ సమీక్ష సమావేశంలో పనుల పురోగతి, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనుల గురించి ఈఈలు ఈఓకు వివరించారు.

విశిష్ట సేవలకు సత్కారం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కేఎల్‌రావు నగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. పలు రంగాల్లో విశిష్ట సేవలందించిన మహిళలను నిర్వాహకులు లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ స్మైల్స్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు నమ్మి అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రీజినల్ చైర్‌పర్సన్ అన్నే కుసుమ, జోన్ చైర్‌పర్సన్ పూర్ణ, రాజమండ్రి నగర పాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.వి.రావు మాట్లాడుతూ.. మహిళలను గౌరవించిన చోట సకల దేవతలు కొలువు తీరి ఉంటారని పెద్దలు చెప్పారన్నారు. ఈ వేడుకల్లో బి.కమల, పెంటి జ్యోతి, ఎండీ రుహి, వసుంధర, మమత, వెంకటలక్ష్మిని క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి ఎస్.డి.వి.ప్రసాద్, బీరం శ్రీనివాసరావు, గుగ్గిలం విజయ్‌కుమార్, అవ్వారు బుల్లాబ్బాయ్ తదితరులు పాల్గొన్నారు.

16న జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నీ

విజయవాడస్పోర్ట్స్: జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ ను ఈ నెల 16వ తేదీన ఆంధ్ర లయోల కాలేజీలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వైఈఎస్-జే వ్యవస్థాపకుడు, డైరెక్టర్ బి.బాలకుమార్, మ్యాజిక్ యూత్ ప్రతినిధి హర్షిత తెలిపారు. వైఈఎస్-జే, మ్యాజిక్ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను లయోల కాలేజీలో శనివారం ఆవిష్కరించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఎలాంటి వయోపరిమితి నిబంధన లేదన్నారు. విజేతలకు నగదు బహుమతి, ట్రోఫీలు అందజేస్తామని వెల్లడించారు.

దుర్గమ్మ సన్నిధిలో నృత్య ప్రదర్శనలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో శనివారం పలువురు కళాకారులు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. విజయవాడ శ్రీనటరాజ నృత్యాలయం కళాకారులు అమ్మవారికి నృత్య కళార్చన అర్పించారు. రాయన శ్రీనివాసరావు పర్యవేక్షణలో 17 మంది కళాకారులు పలు కీర్తనలకు లయబద్ధంగా నృత్యం చేశారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నిర్వహించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఆద్యంతం ఆసక్తితో వీక్షించారు. నృత్య కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు. ఉదయం రాజగోపురం వద్ద పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన శ్రీభరత మాత కోలాట భజన మండలికి చెందిన సభ్యులు కోలాట నృత్య ప్రదర్శన చేశారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో ఎన్టీఆర్ జిల్లాకు కాంస్యం



విజయవాడస్పోర్ట్స్: 15వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హాకీ పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా జట్టు కాంస్యపతకం సాధించింది. మంగళగిరిలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడా ప్రాంగణంలో మూడు రోజులపాటు జరిగిన ఈ పోటీలు శనివారం ముగిశాయి. లీగ్ దశ నుంచి అద్భుతంగా రాణించిన ఎన్టీఆర్ జిల్లా జట్టు శుక్రవారం సెమీస్‌కు చేరింది. మూడో స్థానం కోసం శనివారం జరిగిన పోటీలో 1-0 తేడాతో గుంటూరు జిల్లా జట్టును ఓడించి ట్రోఫీ సాధించింది. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో గుంటూరు జిల్లా జనసేన పార్టీ నాయకుడు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, హాకీ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ నిరంజన్ రెడ్డి, నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పి.జాన్సన్, ఆంధ్రప్రదేశ్ హాకీ అసోసియేషన్ ప్రతినిధులు జి.హర్షవర్ధన్, పి.థామస్, సూర్య ప్రకాష్ చేతుల మీదుగా ఎన్టీఆర్ జిల్లా జట్టు ట్రోఫీ అందుకుంది.

చరిత్ర ఘనం.. సమస్యలే వర్తమానం

- సమస్యలతో కునారిల్లుతున్న డీఎస్ఎంసీ హైస్కూల్
- నూతన భవన నిర్మాణానికి రూ.3.41 కోట్ల నాడు-నేడు నిధులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక నిలిచిపోయిన నిర్మాణ పనులు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



నిలిచిపోయిన డీఎస్ఎమ్‌సీ హైస్కూల్ నూతన భవనం నిర్మాణ పనులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లో తొమ్మిది దశాబ్దాల ఘన చరిత్ర కలిగిన దళవాయి సుబ్బరామయ్య మునిసిపల్ కార్పొరేషన్ (డీఎస్ఎంసీ) హైస్కూల్ సమస్యలతో కునారిల్లుతోంది. స్వాతంత్ర్యం రాక ముందు బ్రిటిష్ పాలనలో నిర్మించిన ప్రాథమిక పాఠశాల 1970లో ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడైంది. దీంతో ప్రాథమిక స్థాయి పిల్లలను అదే పేరుతో వన్‌టౌన్‌లో ఉన్న పాఠశాలకు తరలించారు. ప్రస్తుతం ఆరు నుంచి పదో తరగతి వరకు డీఎస్ఎంసీ హైస్కూల్‌లో విద్యను బోధిస్తున్నారు. గతంలో సుమారు 700 మంది విద్యార్థులతో ఈ పాఠశాల కళకళలాడేది. వేల మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకుని నేడు ఉన్నత స్థాయిలో ఉన్నారు. వారిలో కొంత మంది ఇదే పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్నారంటే అప్పటి విద్యా బోధన ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు. పాఠశాల భవనం నిర్మించి 90 ఏళ్ల గడవటం, రోడ్డు కంటే నాలుగు అడుగుల మేర పల్లంలో ఉండటంతో వర్షం కురిసినప్పుడు పాఠశాల ప్రాగణం నీటమునిగేది. వర్షం తగ్గిన తరువాత నిలిచిన నీరు బయటకు పోయే వరకు పాఠశాలకు సెలవులు ప్రకటించేవారు.

నాడు - నేడు కింద రూ.3.41 కోట్లు మంజూరు

డీఎస్ఎంసీ హైస్కూల్‌లో చాలీచాలని తరగతి గదులతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను స్థానికులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆ సమయంలో అప్పటి ప్రభుత్వం మనబడి నాడు - నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. డీఎస్ఎంసీ హైస్కూల్ పరిస్థితిని వెలంపల్లి శ్రీనివాసరావు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో నూతన భవన నిర్మాణానికి రూ.3.41 కోట్లు మంజూరయ్యాయి. దీంతో హైస్కూల్‌ను సమీపంలోని మైలపల్లి పోలీస్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో అప్పటికే డీఎస్ఎంసీ హైస్కూల్ కోసం 2010లో రూ.37 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదుల భవనంలోకి తరలించారు. అనంతరం హైస్కూల్ భవనం తొలగించటం, 2023 మార్చి నెలలో శంకుస్థాపన వంటి పనులను ప్రారంభించటం చకచకా జరిగిపోయాయి.

13 సెక్షన్లను 9 సెక్షన్లకు కుదించి..

డీఎస్ఎంసీ హైస్కూల్ పాత భవనాన్ని కూల్చేసిన తరువాత 14 ఏళ్ల క్రితం స్కూల్ కోసం నిర్మించిన అదనపు తరగతి గదుల భవనం (గ్రౌండ్‌లో నాలుగు గదులు, ఫస్ట్ ఫ్లోర్‌లో మూడు గదులు)లో స్కూల్‌ను నడుపుతున్నారు. తరగతి గదులు చాలక పోవడంతో 13 సెక్షన్లను 9 సెక్షన్లకు కుదించి చదువు చెబుతున్నారు. ఒక గదిలో ల్యాబ్, ఇతర సామాన్లు ఉండటంతో ఇరుకుగా ఉండి ఒక తరగతి విద్యార్థులు అప్పుడప్పుడు వరండాలో కూర్చుని చదువుకుంటున్నారు. ఇప్పుడు పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలో 18 మంది ఉపాధ్యాయులు ఉండగా, వారిలో ఇద్దరు డెప్యుటేషన్ (సర్దుబాటు)పై వేరే పాఠశాలకు వెళ్లిపోయారు. హైస్కూల్ నూతన భవనం ఎప్పటికి పూర్తవుతుంది, అసలు పూర్తవుతుందా లేదా అని అటు విద్యార్థులు ఇటు ఉపాధ్యాయులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) చొరవ తీసుకుని పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

నిలిచిన నూతన భవన నిర్మాణం

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత నాడు - నేడు నిర్మాణ పనులను నిలిపివేయించారు. అందులో భాగంగానే డీఎస్ఎంసీ హైస్కూల్ నూతన భవన నిర్మాణ పనులు కూడా ఆగిపోయాయి. ఇప్పటికే నిర్మాణ పనులకు దాదాపు రూ.60 లక్షలు ఖర్చు చేసినట్లు సమాచారం. నిర్మాణ పనులను కొనసాగించని పక్షంలో రూ.60 లక్షల ప్రజాధనం వృథా కావడమే కాకుండా విద్యార్థుల ఇబ్బందులు కూడా కొనసాగినట్లేనని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను కొనసాగించాల్సిన బాధ్యత కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వంపై ఉంటుందని పేర్కొంటున్నారు. కక్ష సాధింపు చర్యల కారణంగా విద్యార్థులు అవస్థలు పడతారన్న విషయాన్ని ఆలోచించాలని సూచిస్తున్నారు.



అదనపు తరగతి గదుల భవనంలో నడుస్తున్న డీఎస్ఎమ్‌సీ హైస్కూల్

ఎస్‌బీఐలో మహిళా ఉద్యోగుల సంఖ్య 50 శాతానికి పెంపు

అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాకేష్ కుమార్ పటేల్



భవానీపురం(విజయవాడపశ్చిమ): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 40 శాతం మంది ఉన్న మహిళా ఉద్యోగుల సంఖ్యను 50 శాతానికి పెంచేందుకు బ్యాంక్ నిర్ణయించిందని ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాకేష్ కుమార్ పటేల్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అమరావతి సర్కిల్ పరిధిలోని ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గొల్లపూడి పరిధిలోని శక్తి గ్రీన్స్ ఫంక్షన్ హాల్లో శనివారం నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాకేష్ కుమార్ మాట్లాడుతూ.. ఎస్‌బీఐలో మహిళల పాత్రను ప్రశంసించారు. సీడీఓ రాహుల్ సాంకృత్య మాట్లాడుతూ.. మహిళలతో నిర్వహించే సీఎస్‌పీ ఖాతాదారుల సేవ కేంద్రాలను 500 వరకు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. మహిళా అధికారులే బ్యాంక్ లాభాల్లో ఉండటానికి ప్రధాన కారణమని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్ అన్నారు. బ్యాంక్‌కు ఉత్తమ సేవలు అందించిన మహిళా అధికారులకు విజయవాడ మొడ్యుల్ డెప్యూటీ జనరల్ మేనేజర్ మనీష్ కుమార్ సింగ్ జ్ఞాపికలు అందించి సత్కరించారు. ఎస్‌బీఐ విజయవాడ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి విజయ్ శేఖర్, సునీత, స్వర్ణకుమారి, మహిళా అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు వైఎస్ జగన్ కృషి



పలు రంగాల్లో సత్తా చాటిన మహిళలను సత్కరించిన మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

- రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు అత్యధిక ప్రాధాన్యం
- నేడు రాష్ట్రంలో ఏమి జరుగుతుందో అందరికీ తెలుసు
- మహిళా దినోత్సవంలో మేయర్, డెప్యూటీ మేయర్‌లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా ఉన్నతులుగా ఎదిగేందుకు గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా గత ప్రభుత్వం పనిచేస్తే, నేడు రాష్ట్రంలో మహిళల పరిస్థితి ఎలా ఉందో అందరూ చూస్తున్నారని ఆమె అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం గుణదలలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజరెడ్డి, ఇతర మహిళా కార్పొరేటర్‌లతో కలిసి కేక్ కట్ చేశారు. తొలుత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలందరూ ఎంతో ఆనందంగా ఉన్నారని, అన్ని రంగాల్లో ముందుకెళ్లారన్నారు. నేడు ఆ పరిస్థితి లేదన్నారు. మహిళలను ప్రోత్సహిస్తూ వైఎస్ జగన్ అనేక పథకాలు అమలు చేశారన్నారు. మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేశారని, రాజకీయాల్లో 50 శాతం పదవులు మహిళలకే ఇచ్చారన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో మహిళలను భాగస్వాములను చేశారని పేర్కొన్నారు. డెప్యూటీ మేయర్‌లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజరెడ్డి మాట్లాడుతూ నేడు కూటమి ప్రభుత్వం మహిళలను నిర్లక్ష్యం చేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో మళ్లీ వైఎస్ జగన్‌ను గెలిపించేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు విజిత, రాష్ట్ర జనరల్ సెక్రటరీ స్వప్న, కార్పొరేటర్లు అంబడిపూడి నిర్మలకుమారి, భీమిశెట్టి ప్రవల్లిక, రెహానా నాహీద్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

పలువురికి సత్కారం

మహిళా దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయురాలు శ్రావణి, జాతీయ స్థాయిలో స్కేటింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన ఎం.సుచిత్ర, హాషిక, జాతీయ స్థాయి నృత్య ప్రదర్శనలు ఇచ్చిన ఎం.ప్రణీతిని శాలువాలతో సత్కరించారు.

జగన్ సారథ్యంలోనే మహిళా సాధికారత

మేయర్ రాయన భాగ్యలక్ష్మి



మేయర్ భాగ్యలక్ష్మిని సత్కరిస్తున్న పార్టీ నేతలు



కేబీఎన్‌లో వేడుకలను ప్రారంభిస్తున్న పారిశ్రామికవేత్త జానకి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలోనే మహిళా సాధికారత సాధ్యమని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షురాలు పి.దుర్గాభవాని ఆధ్వర్యంలో పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం మహిళా దినోత్సవం నిర్వహించారు. మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు రెహమతున్నీసా, గోదావరి గంగ తదితరులు కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించారని, పంచాయతీలు, కార్పొరేషన్లు, శాసన సభ, శాసన మండలిలో మహిళలకు ప్రాధాన్యమిచ్చారని గుర్తుచేశారు. సంక్షేమ పథకాల అమలులోనూ మహిళలకు అవకాశాలు కల్పించారని పేర్కొన్నారు. మహిళా నాయకులు అండలూరి లత, ఉప్పాడ రాజకుమారిరెడ్డి, పేరూరి పద్మ, అన్నపూర్ణ, అరుణ, సంగం సుబ్బులు, కుమారి, మధు, చిన్ని, నిర్మల, మున్నీసా, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

కేబీఎన్ కళాశాలలో..

ప్రతి కుటుంబం నుంచి ఓ మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలని పారిశ్రామికవేత్త కేశినేని జానకిలక్ష్మి పేర్కొన్నారు. కేబీఎన్ కళాశాలలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, పారిశ్రామికవేత్త టి.హేమవతి రాజ్యలక్ష్మి, కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాసు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ పాల్గొన్నారు.

ఏ సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహిళలు ఏ సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కోవాలని అక్కినేని ఉమెన్స్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అక్కినేని మణి సూచించారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మారథాన్-2కె కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కళాశాల నుంచి కాళేశ్వరరావు మార్కెట్ వరకూ భారీ ర్యాలీ సాగింది. మహిళల ఔన్నత్యాన్ని చాటేలా భరత మాత, ఝాన్సీ లక్ష్మీబాయి, సావిత్రిబాయి పూలే, రాణిరుద్రమదేవి, కల్పనాచావ్లా, ప్రతిభాపాటిల్, పి.వి.సింధు, సానియా మీర్జా, కిరణ్ బేడీ, మేరీ కోమ్ తదితరుల వేషధారణలతో విద్యార్థినులు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మార్కెట్ సెంటర్‌లో మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా డాక్టర్ అక్కినేని మణి మాట్లాడుతూ.. మహిళలు సమస్యలకు భయపడకూడదని పేర్కొన్నారు. మహిళలు సామాజిక చైతన్యం కోసం సైతం పాటుపడాలన్నారు. అనంతరం డాక్టర్ అక్కినేని మణితో పాటు న్యూట్రిషియన్ సీహెచ్ విజయశ్రీ, లయన్స్ క్లబ్ మల్టీపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ దామర్ల శ్రీశాంతి తదితరులను సత్కరించారు. కళాశాల అధ్యక్ష కార్యదర్శులు చలవాది మల్లికార్జునరావు, చిట్టా అమర్ సుధీర్ మాట్లాడుతూ.. మహిళా చైతన్యం కోసం తమ కళాశాల పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, కళాశాల కోశాధికారి జి.సందీప్, కేబీఎన్ కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాసు, హిందూ హైస్కూల్స్ కమిటీ ఏఓ డాక్టర్ నారాయణరావు, మద్దూరి సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పతంజలిశాస్త్రి, డాక్టర్ సురేష్‌బాబు, సీఓఈ డాక్టర్ ఎస్.మణికంఠ, మారథాన్ కన్వీనర్ పి.ఎస్.శిల్ప తదితరులు పాల్గొన్నారు.



మారథాన్‌లో పాల్గొన్న వేలాది మంది విద్యార్థినులు, కమిటీ ప్రముఖులు

ఘనంగా మహిళా దినోత్సవం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చేవూరి రామస్వామి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు భీమవరపు నీరజ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. చిట్టినగర్ సొరంగం రోడ్డులోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో జరిగిన ఈ వేడుకలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి మహిళలు విచ్చేశారు. పలు రంగాల్లో రాణించిన పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫిరంగి చంద్రశేఖర్, గౌరవ సలహాదారు కుప్పిలి సూర్యనారాయణ, రాష్ట్ర మహిళా గౌరవ అధ్యక్షురాలు దొడ్డుజు సావిత్రి, తిరుపాలాచారి, వెంకటేశ్వరాచారి పాల్గొన్నారు.



విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సత్కారం అందుకుంటున్న మహిళలు

42వ డివిజన్‌లో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం 42వ డివిజన్ కమ్యూనిటీ హాలు ప్రాంగణంలోని సచివాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. మహిళా దినోత్సవ ఔన్నత్యాన్ని తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. చైతన్యరెడ్డి మాట్లాడుతూ మహిళా దినోత్సవ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బ్రహ్మారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. భవానీపురం శ్రీభవాని హాస్పిటల్‌లో జరిగిన వేడుకల్లో వివిధ రంగాలకు చెందిన మహిళలను సత్కరించారు. హాస్పిటల్ ఎండీ వెనిగళ్ల చంద్రశేఖర్ కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల పదో తేదీ వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నెఫ్రాలజిస్ట్ డాక్టర్ కాసినబోయిన భారతి, ఉపాధ్యాయినిలు జయశ్రీ, శశికళ తదితరులు పాల్గొన్నారు.



మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ గోదావరి గంగ

మహిళల సమానత్వం సమాజ కర్తవ్యం

విద్యాధరపురం/ వించిపేట(విజయవాడపశ్చిమ): సమాజంలో లింగ వివక్షను రూపుమాపి, మహిళల సమానత్వం సాధించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని 50వ డివిజన్ సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం 50వ డివిజన్‌లో శానిటేషన్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్, సచివాలయం అడ్మిన్ యూసఫ్, వెంకటేశ్వరరావు, ప్రవీణ్, చంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.



గొల్లపాలెంగట్టు రోడ్డులో మహిళా దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ సత్యబాబు

మహిళలు చైతన్యవంతులు కావాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహిళలు మరింత చైతన్యవంతం కావాలని, అప్పుడే సమాజం పురోగతి సాధిస్తుందని 47వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ గోదావరి గంగ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం డివిజన్ పరిధిలోగల సర్కిల్-1 కార్యాలయంలో నగరపాలక పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది కలిసి కార్పొరేటర్ గోదావరి గంగను సత్కరించారు. అనంతరం ఆమె పారిశుద్ధ్య మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోదావరి గంగ మాట్లాడుతూ.. ఒక మహిళ అభివృద్ధి చెందితే ఆమె కుటుంబంకూడా ఎదుగుతుందని, తద్వారా సమాజం పురోగతి సాధిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ కె.శివరామప్రసాద్, పారిశుద్ధ్య మహిళా కార్మికులు పాల్గొన్నారు.

సునీత విలియమ్స్‌కు అభినందనలు



వేడుకల్లో పాల్గొన్న మహిళలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అంతరిక్ష యాత్రికురాలు సునీత విలియమ్స్‌కు పలువురు మహిళలు అభినందనలు తెలిపారు. స్థానిక ఎస్ఎల్‌వీ టౌన్‌షిప్‌లోని గ్రీన్ మెడోస్‌లో శనివారం సామాజికవేత్త సునీత లక్కంరాజు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సునీత విలియమ్స్ ఎనిమిది నెలలుగా అంతరిక్షంలో ఉంటూ తిరిగి భూమి మీదకు చేరుకోవడానికి ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా ఉన్నారని తెలిపారు. విద్యావేత్త సువర్ణ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని ఆకాంక్షించారు. లక్ష్మి నాదెళ్ల మాట్లాడుతూ.. మహిళాభ్యున్నతికి ప్రభుత్వాలు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మహిళలకు పలు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాధవి, కనకదుర్గ, కె.చందన, హరిత, స్నేహ, మధు, లక్ష్మి, శైలజ, బాల, పింకి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు



ఫ్యాన్సీ డ్రెస్ పోటీలో చిన్నారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక క్రాంబ్వే రోడ్డులోని సెయింట్ జాన్స్ పాఠశాలలో శనివారం నిర్వహించిన ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు ఆకట్టుకున్నాయి. టైటానిక్, సైన్స్ వర్సెస్ స్పిరిచ్యువల్, చైల్డ్ లేబర్, బృహన్నల తదితర వేషధారణతో చిన్నారులు అబ్బురపరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన డాక్టర్ శిల్ప మందవ, డాక్టర్ యేదుపాటి లక్ష్మీప్రసన్న, జాస్తి పుష్పలత, పి.రత్నశ్రీ ఫ్యాన్సీ డ్రెస్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెయింట్ జాన్స్ పాఠశాల సెక్రటరీ/కరస్పాండెంట్ టి.సుమన్ త్యాగరాజ్, ప్రెసిడెంట్ టి.మోనిక సుమన్, సీఏఓ రామభారతి, ప్రిన్సిపాల్ కె.వి.కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలుచేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టీడీపీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారి ఆటో కార్మికుల జీవనాన్ని దెబ్బతీసే విధానాలు అవలంబిస్తోందని ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం(ఇఫ్టూ) నగర అధ్యక్షుడు దాది శ్రీనివాసరావు అన్నారు. ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడిగితే ఆర్థిక పరిస్థితి బాగోలేదని కూటమి ప్రభుత్వం చెబుతోందని, హామీలు ఇచ్చేటప్పుడు ఆర్థిక పరిస్థితి తెలియదా అని నిలదీశారు. శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం సమావేశం జరిగింది. దాది శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 2002వ సంవత్సరం నుంచి నేటి వరకు ఆటో కార్మికులను టీడీపీ ప్రభుత్వం అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టిందన్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఆటో కార్మికుల జీవనోపాధికి విఘాతం కలిగిస్తోందన్నారు. గత ప్రభుత్వంలో జీవో 21 తెచ్చినప్పటికీ తమను ఎటువంటి ఇబ్బందులకు గురి చేయలేదని గుర్తు చేశారు. ఏడాది తిరగక ముందే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. జీఓ 8ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆంక్షలు లేకుండా నగరాన్ని ఫ్రీజోన్‌గా ప్రకటించాలన్నారు. విజయవాడ పరిసర మండలాల ఆటోలకు నగరంలోకి ట్రాన్స్‌ఫర్ చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. హామీలు అమలు చేయకపోతే ఉద్యమం చేపడతామన్నారు. ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం నగర అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, కార్యదర్శి సీహెచ్ పెద్దిరాజు, జిల్లా అధ్యక్షుడు ముని శంకర్, ఆటో కన్సల్టింగ్ ప్రతినిధులు పి.రాజా, పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలతో శనివారం ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నగరంలోని వైఎస్సార్ కాలనీ, దావు బుచ్చయ్య కాలనీ, బుడమేరు పరివాహక ప్రాంతం, బందరు కాల్వ పరిసర ప్రాంతాలలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. బుడమేరు కాలువలో ట్రక్సర్ మిషన్ సహాయంతో గుర్రపు డెక్కలు తొలగించారు. మలేరియా సిబ్బంది బోటు ద్వారా బందరు కాలువలో ఉన్న వ్యర్థాలను పరిశుభ్రపరిచారు. డ్రోన్ సహాయంతో ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేశారు. ఈ సందర్భంగా బయాలజిస్టు సూర్యకుమార్ మాట్లాడుతూ దోమల నివారణకు మలేరియా సిబ్బందితో యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని ఫాగింగ్, ఎంఎల్ ఆయిల్‌ను సైడ్ డ్రైన్లలో డ్రోన్‌ల ద్వారా స్ప్రే నిర్వహించామన్నారు. కాల్వల్లో కూడా ఎప్పటికప్పుడు పూడికలు తీసి నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటకం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.